ఉన్నత లక్ష్యాలు సాధించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మిడ్జిల్, ఫిబ్రవరి 14 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించేందుకు పట్టుదలతో చదవాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు వేణుకళ్యాణ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల 9, పదో తరగతి విద్యార్థులకు విద్యా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత విద్యాప్రమాణాలు ఉంటాయని, సాధించాలన్న పట్టుదల, తపన ఉంటే ఎంతటి లక్ష్యాన్నైనా సాధించవచ్చన్నారు. పరీక్షలనే భయం తొలగి, బాధ్యతగా చదువుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహంగా మెలిగి సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలన్నారు. పరీక్షల సమయంలో టీవీలు, సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో రవీందర్, చేయూత స్వంస్థ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, డాక్టర్ శివకాంత్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీ తరగతులు ప్రారంభించాలి

- నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష

అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 : జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైన సందర్భంగా విద్యార్థులకు తరగతులు ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని నారాయణపేట కలెక్టర్ శ్రీహర్ష జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్‌కు సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా దవాఖానను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- మహబూబ్‌నగర్ డీఎంహెచ్‌వో కృష్ణ


రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో కృష్ణ

హన్వాడ, ఫిబ్రవరి 14 : చిన్నారుల ఆరోగ్యంపై వైద్యులు,తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో కృష్ణ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది నెలల నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు మిటమిన్-ఏ టీకా ఇవ్వాలని తెలిపారు. సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎండల తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలకు తగిన సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి, సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

రాజాపూర్, ఫిబ్రవరి 14 : వరి పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని దొండ్లపల్లిలో వరి నాట్లను పరిశీలించి రైతులకు సస్యరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పిలక దశలో కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోఫురాన్ 3జీ గుళికలను చల్లుకోవాలని సూచించారు. లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్వర్‌రెడ్డి

మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్న కౌన్సిల్ సభ్యులు

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 14 : మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా మహేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. నిజామాబాద్ మున్సిపాలిటీ నుంచి బదిలీపై మహబూబ్‌నగర్ వచ్చారు. ఇక్కడ పనిచేసిన ప్రదీప్‌కుమార్ మణికొండ మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. నూతన మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

రక్తదాన శిబిరం విజయవంతం

రక్తదానం చేస్తున్న యువకులు

జడ్చర్ల, ఫిబ్రవరి 14 : జడ్చర్ల పట్టణ రజక సంఘం మాజీ అధ్యక్షుడు, మాజీ వార్డు సభ్యుడు రవి ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 10వార్డులో రవి అభిమానులు మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన వారి సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించగా, 31మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుమ్మరిరాజు, రజకసంఘం పట్టణాధ్యక్షుడు బి.శివకుమార్, గౌరవాధ్యక్షుడు ఎన్.లక్ష్మయ్య, మెడికల్ ఆఫీసర్ విద్య, క్యాంప్ ఆర్గనైజర్ మధుసూదన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శివలీల, దీక్షిత్, అక్షిత్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వసంత పంచమి

- సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు
- చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

పీయూలో అమ్మవారికి పూజలు చేస్తున్న వీసీ

నారాయణపేటలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

పాలమూరు, ఫిబ్రవరి 14 : జిల్లా కేంద్రంలోని పాలమూరు విశ్వవిద్యాలయంలో బుధవారం వసంత పంచమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వ హించారు. ఈ సందర్భంగా మైసమ్మ ఆల యంలో వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ ప్రత్యేక పూజ లు చేశారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సా ధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీ జీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, అధ్యాపకురాలు సంధ్యారాణి, ఒప్పంద అధ్యాపకుల సంఘ నాయకులు అర్జున్‌కుమార్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో..

మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. ఈ సంద ర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో సరస్వతీ మాత చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ విద్యార్థులకు వసంతపంచమి విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవరకద్రలో..

దేవరకద్ర, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని శ్రీవాణి శిశుమందిర్, డోకూర్ గ్రామంలోని తపోవన్ ఉన్నత పాఠశాలలో బుధవారం వసంత పంచామి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి చిన్నారులకు సా మూహిక అక్షరాభ్యసం చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ నిరంజన్ రెడ్డి, నాగేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో..

భూత్పూర్, ఫిబ్రవరి14: అమిస్తాపూర్ గ్రామ శివారులోని జ్ఞాన సరస్వతిదేవి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని అర్చకుడు రవిశంకర్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, తల్లి దండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపేటలో..

నారాయణపేట, ఫిబ్రవరి 14 : పట్టణంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సింగార్‌బేస్‌లోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో అక్షరాభ్యాసం చేయించారు. అంతకుముందు సరస్వతీ మాతకు పూజలు చేసి గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించారు. మండలంలోని శేర్నపల్లి, దామరగిద్ద మండలంలోని వత్తుగుండ్ల శిశుమందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అదేవిధంగా పట్టణంలోని శక్తిపీఠంలో చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో సరస్వతి విద్యాపీఠం జిల్లా గౌరవ అధ్యక్షుడు రతంగపాండురెడ్డి, విభాగ్ కార్యదర్శి ఎల్లప్ప, విభాగ్ విద్వత్ పరిషత్ కన్వీనర్ లక్ష్మయ్యగౌడ్, జిల్లా అధ్యక్షుడు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో..

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని బాలకేంద్రంలో ఎస్పీ బాలు అభిమాన సంఘం ఆధ్వర్యంలో వసంత పంచమిని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ హరినారాయణ భట్టడ్, జనరల్ పిజిషియన్ కార్తీక్ హాజరై సరస్వతీ మాత చిత్రపటానికి, సంగీత వాయిద్య పరికరాలకు పూజలు చేశారు. అనంతరం కవి జ్ఞానేశ్వర్ గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, గాయకుడు నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 14 : వసంత పంచమి సందర్భంగా బుధవారం జడ్చర్లలోని పలు పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసన కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక శిశుమందిరం పాఠశాలలో పురోహితుల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. బాసరలోని శ్రీజ్ఞాన సరస్వతీ ఆలయం నుంచి తెచ్చిన కుంకుమ, సరస్వతీ మాత చిత్రపటాలను పిల్లల తల్లిదండ్రులకు అందజేసి చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు.

కృష్ణలో..

కృష్ణ, ఫిబ్రవరి 14 : వసంత పంచమి సందర్భంగా మండలంలోని ముడుమాల, కాన్‌దొడ్డి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ టీచర్లు అక్షరాభ్యాసం చేయించారు.

దేవరకద్రలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

జడ్చర్లలో..

భూత్పూర్ జ్ఞానసరస్వతీ దేవి ఆలయంలో..

మహిళా ఓటర్లే కీలకం

మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 14 : ఎన్నికల్లో మహిళా ఓటర్లు ఎంతో కీలకమని కాంగ్రెస్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి మహిళల పాత్ర ఎంతో ఉన్నదని, పార్లమెంట్ ఎన్నికల్లోనూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 14 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమిపాలైన వారు కుంగిపోకుండా మరింతగా రాణించేందుకు కృషి చేయాలని టగ్‌ఆఫ్‌వార్ అసోసియేషన్ జిల్లా ప్రధా న కార్యదర్శి గోపాలం అన్నారు. ఈనెల 13న జాతీయ మహిళా దినోత్సవం, సరోజినీ నా యుడు జయంతిని పురస్కరించుకొని అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలికలకు వివిధ పోటీ లు నిర్వహించారు. గెలుపొందిన వారికి బుధవారం మక్తల్ మినీ స్టేడియంలో బహుమతులు అందజేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఫిబ్రవరి 14: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని దేవరకద్ర ఎస్సై నాగన్న తెలిపారు. బుధవారం కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి సైబర్ నేరస్తులు ఫోన్ చేసి రూ.2 లక్షలు పంపించాలని బెదిరించడంతో దేవరకద్ర పోలీసులను సంప్రదించాడు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల సైబర్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. సైబర్ నేరగాళ్లు ఫోన్‌కు బదులుగా ఇంటర్‌నెట్ ద్వారా కాల్ చేస్తారని, అలాంటి కాల్స్‌ను ఎత్తకుండా వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

హంసవాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు

స్వామివారిని హంసవాహనంపై ఊరేగిస్తున్న భక్తులు

జడ్చర్ల, ఫిబ్రవరి 14 : మండలంలోని గంగాపూర్ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం ఐదో రోజు స్వామివారికి రెండు మనోహరమైన సేవలు నిర్వహించారు. ముందుగా స్వామివారిని శేషవాహనంపై పల్లకీలో ఉంచి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. అనంతరం హంస వాహనంపై స్వామివారిని ఉంచి గ్రామ ప్రధానవీధుల్లో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈనెల 15వ తేదీన రాత్రి 9గంటలకు శ్రీ లక్ష్మీ చెన్నకేశస్వామికి పుష్పరథం(చిన్నతేరు) నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో దీప్తిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో దీప్తిరెడ్డి, విశ్వం, జనార్దన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

తిమ్మప్ప బ్రహ్మోత్సవాలు..

మక్తల్, ఫిబ్రవరి 14 : మండలంలోని మహాద్వార్ కొండపై వెలసిన గట్టుతిమ్మప్ప (వేంకటేశ్వర) స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగా వైభవంగా ప్రారంభమయ్యాయి. మాఘశుద్ధ రథసప్తమిని పురస్కరించుకొని ఈనెల 14నుంచి 18వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9గంటలకు స్వామివారి ఉత్సవమూర్తి విగ్రహాలను గ్రామ పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో భజన, కోలాటంతో కొండపైకి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం కృష్ణానదీ జలాలతో స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం చేశారు. గురువారం సాయంత్రం ప్రభోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.

పుల్వామా అమరవీరులకు ఘన నివాళి

రాజాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు

రాజాపూర్, ఫిబ్రవరి 14 : పుల్వామాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన వీర జవాన్లను స్మరిస్తూ బుధవారం మండల కేంద్రంలో మాజీ సైనికులు, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. పుల్వామా దాడిలో వీరమరణం పొందిన సీఆర్‌పీఎఫ్ జవాన్లను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు, మాజీ సైనికులు, యువజన సంఘాల నాయకులు 150 మీటర్ల జెండాతో ర్యాలీ నిర్వహించారు.

నవాబ్‌పేటలో..

నవాబ్‌పేట, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో వీరమరణం పొందిన జవాన్లకు ఘనంగా నివాళులర్పించారు.

భర్త వేధింపులు భరించలేక భార్య ఆత్మహత్య

నర్వ, ఫిబ్రవరి 14 : భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని రాయికోడ్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై కురుమయ్య కథనం ప్రకారం.. మండలంలోని రాయికోడ్‌కు చెందిన హన్మంతుతో చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన భాగ్యమ్మకు 12ఏండ్ల కిందట వివాహమైంది. వీరికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. కొన్నాళ్లుగా భర్త హన్మంతు వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో భాగ్యమ్మ (36) మనస్తాపానికి గురై బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చుట్టుపక్కల వారు గమనించి ఇంటి తలుపులు పగులగొట్టి భాగ్యమ్మను కాపాడేందుకు ప్రయత్నించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ..

బాలానగర్, ఫిబ్రవరి 14 : కుటుంబ కలహాలతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని ఉడిత్యాలలో బుధవారం చోటుచేసుకున్నది. ఎస్సై తిరుపాజీ కథనం ప్రకారం.. ఉడిత్యాలకు చెందిన నర్సింహులు(40) కొంతకాలంగా కుటుంబ సభ్యులతో తరుచూ గొడవ పడేవాడన్నారు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు బుధవారం మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లైంగికదాడిలో ఇద్దరికి జీవిత ఖైదు

భూత్పూర్, ఫిబ్రవరి 14 : లైంగికదాడిలో ఇద్దరికి జీవిత ఖైదు విధించిన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. భూత్పూర్ సీఐ రామకృష్ణ బుధవారం ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన అమృత టైలర్ పనిచేస్తూ జీవించేది. 2016 ఆగస్టు 9వ తేదీన టైలర్ దుకాణంలోనే తన కూతురును అమిస్తాపూర్‌కు చెందిన విప్పల శ్రీనివాసులుతో బలవంతంగా అక్రమ సంబంధానికి సహకరించింది. దీంతో బాధితురాలు తల్లి అమృత, అఘాయిత్యానికి పాల్పడిన విప్పల శ్రీనివాసులుపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై అశోక్, సీఐ గిరిబాబు విచారించి కేసు నమోదు చేశారు. లైంగికదాడి కేసులో బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్జి నిందితులిద్దరికీ జీవిత ఖైదు, రూ.2,500ల జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చినట్లు సీఐ తెలిపారు.

నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపేస్తాం: పీయూ వీసీ

పాలమూరు, ఫిబ్రవరి 14 : హాస్టల్ నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని, లేదంటే బిల్లులు నిలిపివేస్తామని వీసీ లక్ష్మీకాంత్‌రాథోడ్ హెచ్చరించారు. పాలమూరు విశ్వవిద్యాలయంలోని లేడీస్ హాస్టల్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం చేసి త్వరలోనే హాస్టల్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. కార్యక్రమంలో పీజీ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణయ్య, చీఫ్ వార్డెన్ సంధ్యారాణి ఉన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

పారిశ్రామిక క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగ విద్యార్థులు భూత్పూర్ మండలం పోతులమడుగు ఎంఎస్‌ఆర్ కాటన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పత్తిద్వారా నూలు తయారీ విధానం గురించి తెలుసుకున్నారు.

తల్లిదండ్రులకు విద్యార్థుల పాదపూజ

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 : పిల్లలకు సంస్కృతీ సంప్రదాయాలు నేర్పించాలని ఆర్‌ఎస్‌ఎస్ పాలమూరు జిల్లా సహ కార్యవాహ ప్రభాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సరస్వతీ విద్యాపీఠం విభాగ్ కార్యదర్శి ఎల్లప్ప, లక్ష్మయ్యగౌడ్, ప్రధానాచార్యులు దత్తూచౌదరి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ పోస్టు నియామకంపై రగడ

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 14 : జడ్చర్ల కాంగ్రెస్ పార్టీలో మైనార్టీ పోస్టుల నియమాకంపై రగడ నెలకొన్నది. నియోజకవర్గ మైనార్టీ కోఆర్డినేటర్ పోస్టు నియామకం వివాదంగా మారింది. స్థానిక మైనార్టీ నేతలను సంప్రదించకుండా జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫయాజ్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ పోస్టును భర్తీ చేయడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. బుధవారం పట్టణంలోని ఆల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమాన్ని స్థానికులు అడ్డుకున్నారు. సమాచారం లేకుండా పోస్టులను నియమించడమే గాకుండా సన్మాన కార్యక్రమాన్ని ఎలాం నిర్వహిస్తారని కాంగ్రెస్ మై నార్టీ నేతలు ఖయ్యూం, ఫక్రొద్దీన్, బషీర్‌తోపాటు పలువురు జిల్లా అధ్యక్షుడిని ప్రశ్నించా రు. ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధ్యక్షుడి ని మార్చాలని నినాదాలు చేశారు. దీంతో స న్మాన కార్యక్రమాన్ని రద్దు చేసి జిల్లా అధ్యక్షు డు ఫయాజ్ అక్కడి నుంచి చిత్తగించారు.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం

పాలమూరు, ఫిబ్రవరి 14 : మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 10:30గంటలకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పరిషత్ కార్యనిర్వహణ అధికారి జి.రాఘవేందర్‌రావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు, జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు, ఎంపీపీలు హాజరుకావాలని తెలిపారు.

నాభిశిల ప్రతిష్ఠాపన..

నారాయణపేట టౌన్, ఫిబ్రవరి 14 : పట్టణంలోని భీమండి కాలనీలో రామ్‌సేన ఆధ్వర్యంలో గురువారం నాభిశిల (బొడ్రాయి), నవగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి రంగస్వామి బ్రహ్మోత్సవాలు

మక్తల్, ఫిబ్రవరి 14 : మండలంలోని కర్నిలో వెలిసిన గుంటి రంగస్వామి బ్రహ్మోత్సవాలు మాఘశుద్ధ రథసప్తమిని పురస్కరించుకొని ఈనెల 15వ తేదీ నుంచి వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం సుప్రభాత సేవ, పల్లకీసేవ, అలంకరణోత్సవం, ప్రభోత్సవం ఉంటాయన్నారు. 16న పంచామృతాభిషేకం, శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం, 17న పాలఉట్లు, పల్లకీసేవ ఉంటుందన్నారు.

రేపు అవగాహన సదస్సు

మక్తల్ టౌన్, ఫిబ్రవరి 14 : పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షల నేపథ్యంలో భయాందోళన, ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు డీవైఎస్‌వో వెంకటేశ్, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్లస్టర్ హెచ్‌ఎం అనిల్‌గౌడ్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. మక్తల్ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు బీ కేర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ద్వారకా గార్డెన్‌లో సైకాలజిస్ట్ శ్రీపాదం హాజరై విద్యార్థులకు సూచనలు చేస్తారన్నారు.

రేపటి నుంచి చెన్నకేశవ స్వామి ఉత్సవాలు

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 14 : మండలంలోని రాచాల చెన్నకేశవస్వామి ఆలయ ఉత్సవాలు 16వ తేది నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం, రథోత్సవం, 17వ తేదీన ఉద్దాల ఊరేగింపు, 18న బండ్ల ఊరేగింపు, 19న స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా 17, 18న ఉమ్మడి జిల్లాస్థాయి కబడ్డీ, 19న రాష్ట్రస్థాయి వృషభ రాజముల బలప్రదర్శన ,17వ తేదీన ట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ డ్రైవింగ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

నవాబ్‌పేట, ఫిబ్రవరి 14 : మండలంలోని పోమాల శివారులో నిర్మించిన శ్రీఅనంత లక్ష్మీ పద్మనాభస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి సుధీర్‌పాండ్యన్ పోమాలలో సొంత నిధులతో ఆలయాన్ని నిర్మించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, నాయకు లు శ్రీనివాస్ రెడ్డి, నరేశ్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి విరాళం

ధన్వాడ, ఫిబ్రవరి 14 : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(సంతబజార్)లో బుధవారం వసంత పంచమిని నిర్వహించారు. ఊట్కూర్ మండలంలోని నిడుగుర్తికి చెందిన ఉపాధ్యాయుడు రామకృష్ణ పాఠశాల అభివృద్ధికి రూ.25వేలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 14 : మున్సిపాలిటీ పరిధిలోని నిమ్మబావిగడ్డ తెలుగు, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను జిల్లా సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ తనిఖీ చేశారు. బుధవారం ఆయా పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ నిర్వహణను పరిశీలించారు. తెలుగు, గణితం, ఆంగ్లంపై విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు.

ఆటోను ఢీకొన్న కారు

- ఇద్దరికి గాయాలు

మూసాపేట(అడ్డాకుల), ఫిబ్రవరి 14 : ఆటోను కారు ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం. బుధవారం గుడిబండ గ్రామానికి చెందిన కొందరు ఆటోలో అడ్డాకుల సంతకు వెళ్తుండగా ఆటో జాతీయ రహదారి దాటే క్రమంలో హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళ్తున్న కారు టైరు పేలి అదుపు తప్పి ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ఉన్న బొంబాయి రాములు, వెంకటమ్మకు గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం జిల్లా దవాఖానకు తరలించార న్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల టౌన్, ఫిబ్రవరి 14 : మండలంలోని గోప్లాపూర్‌కు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గోప్లాపూర్‌కు చెందిన కె.సంతోష(20) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి పడుకుం ది. బుధవారం ఉదయం కుటుంబసభ్యు లు నిద్రలేచిచూడగా యువతి కనిపించలే దు. తండ్రి రాములు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసిన్నట్లు ఎస్సై తెలిపారు.